బౌరంపేట ప్రభుత్వ, కత్వ చెరువు స్థలాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్


నిర్మాణాలు జరుగుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

దుండిగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బౌరంపేట ప్రభుత్వ సర్వేనెంబరు 166/9, కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్‌డీఓ శ్యామ్ ప్రకాష్ దుండిగల్ తహసీల్దార్ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఇటీవల బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఈ భూమిని కాపాడాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓ, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాలను సందర్శించి, సర్వేనెంబరు 166/9, కత్వచెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో జరుగుతున్న నిర్మాణాలపై రెవెన్యూ అధికారులను, ఆర్డీవోను అడిషనల్ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరుసగా బీజేపీ నాయకులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చెయ్యడంతో త్వరలోనే వీటిపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఆర్డీవో తెలిపారు.

సీసీరోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ నవోదయ కాలనీలో సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా వేగంగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డుపై వర్షపునీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తతకుండా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీమున్నా, ఫారూఖ్, రాజిరెడ్డి, లక్ష్మణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, నాగేశ్వరరావు, రమేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గాజులరామారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి ఆయన బుధవారం పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, కాలనీ అధ్యక్షుడు వీరారెడ్డి, రజనీకాంత్ తదితరులు పాలొన్నారు.


ఫిష్‌మార్కెట్‌లో వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్ మెట్టు సాయికుమార్

మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఈ మేరకు కేపీహెచ్‌బీలోని ఫిష్ మార్కెట్‌ను బుధవారం ఆయన సందర్శించి అర్హులైన వారే వ్యాపారాలు చేసుకోవాలని, ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఎవరికి పడితే వారికి స్టాల్స్ కేటాయించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరలోనే సొసైటీలో సభ్యత్వం ఉన్న వారే ఇక్కడ చేపలు అమ్ముకునే విధంగా చూడాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఫిష్‌మార్కెట్‌లో ఉపాధి కల్పించేందుకు చొరవ తీసుకోవాలని చైర్మన్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు చేసిన విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై దళితులకు హక్కులను కల్పించాలి

పేట్‌బషీరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): దళితులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు పట్టా భూములుగా మార్చి రైతులకు వాటిపై శాశ్వత హక్కులను కల్పించాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ అన్నారు. జగద్గిరిగుట్టలోని నల్లమల గిరిప్రసాద్ భవన్‌లో మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశం కె.దుర్గయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చినవేనన్నారు. 1975లో ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం అసైన్డ్ భూములను విక్రయించడం, కొనుగోలు చెయటం, బ్యాంక్‌ల్లో తనఖా పెట్టుకోవడానికి బహుమతిగా ఇవ్వడానికి అవకాశం లేకపోవడం వలన పేద రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ పేద అసైన్డ్ రైతులకు మేలు జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఏసురత్నం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్, జిల్లా కార్యదర్శి సహదేవ్, రాములు, ఎల్లయ్య, రామస్వామి, సాయిలు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాల్లో అవకాశం పేరుతో యువతిపై లైంగికదాడి

రాయదుర్గం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానని నమ్మించి యువతిపై పలుమార్లు లైంగికదాడి చేసిన అసిస్టెంట్ డైరెక్టర్‌ను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్‌కు చెందిన డి.సిద్ధార్థవర్మ(30) కొండాపూర్‌లో నివాసం ఉంటూ సినీ పరిశ్రమలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. పుప్పాలగూడకు చెందిన ఓ యువతి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. ఆమెకు సిద్ధార్థవర్మ పరిచయమయ్యాడు. 'అందంగా ఉన్నావు.. నీకు సినిమాలో అవకాశం కల్పిస్తా' అని నమ్మించి ఇంటికి పిలుపించుకున్నాడని, మద్యం ఇచ్చి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని బాధితురాలు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సిద్ధార్థవర్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసం బీజేపీ కృషి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

నిజాంపేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ముందుంటుందని ఆ పార్టీ ప్రగతినగర్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి అన్నారు. ప్రగతినగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావును నాయకులతో కలిసి వినతిపత్రం బుధవారం అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్‌కాయస్, మూడుకోతుల బొమ్మల సర్కిళ్లలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందని, అలాగే రోడ్లన్నీ గుంతలు మయంగా మారాయన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు శాశ్వత అడ్డా ఏర్పాటు చేయాలి

పేట్‌బషీరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు శాశ్వత అడ్డాను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కె.ఏసురత్నం అన్నారు. జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మికులతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చివరి బస్సుస్టాప్ వద్ద కార్మికుల అడ్డాను ఏర్పాటు చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, గతంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులకు సదుపాయాలు కల్పించాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రం అందిచేశామని తెలిపారు. కార్మికుల కోసం ఐదు రూపాయల భోజన సదుపాయం కల్పించాలని అధికారులను వేడుకున్నా ఇంత వరకు స్పందించ లేదన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసు, హరినాథరావు, నాగన్న, రాములు, సామేల్, మునలయ్య, యాదగిరి, శంకర్, శ్రీను, కళ్యాణ్ పాల్గొన్నారు.

దళితులు రాత్రి 11 తర్వాతే బోనాలు తేవాలట!

- నానక్‌రాంగూడలో అడ్డుకున్న ఇతర కులాల వారు
- ఆలయం ఎదుట బైఠాయించి బాధితుల నిరసన


ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేస్తున్న దళితులు

రాయదుర్గం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడ గ్రామంలో కులాల గొడవలు వెలుగు చూస్తుండటం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్లితే.. జూలై 28న నానక్‌రాంగూడ గ్రామంలో అన్నికులాల వారు బోనాల పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. అదే సమయంలో దళితులు పోతరాజులు, డప్పువాయిద్యాల నడుమ బోనాలతో ఊరేగింపుగా నల్లపోచమ్మ ఆలయానికి వచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పిస్తుండగా గ్రామంలోని అగ్రవర్ణాలకు చెందిన సూరారం హరీశ్వర్‌రెడ్డి, నాగార్జునముదిరాజ్ అడ్డుకుని తమ కులస్థులు బోనాలు సమర్పించిన అనంతరం రాత్రి 11 గంటలకు దళితులు బోనాలు సమర్పించాలని చెబుతూ ఆలయ గేటుకు తాళం వేశారు. దీంతో దళితులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం ఇచ్చి అగ్రకులాల వారి చర్యలను నిరసిస్తూ ఆలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని రెండు వర్గాలవారితో మాట్లాడి సమస్యను పరిష్కరించి దళితులు బోనాలు సమర్పించేలా చర్యలు తీసుకున్నారు. దీనిపై ఆదేరోజు హరీశ్వర్‌రెడ్డి, నాగార్జునముదిరాజ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా తమను అగ్రవర్ణాల వారు కులం పేరుతో దూషించి తమపై దాడి చేశారని జక్కుల రమేష్ బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఆయన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులు, ఇతర అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ కేసు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ముందుకు రావడంతో మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ వివాదంపై గ్రామపెద్దలు కలుగజేసుకుని సర్దిచెప్పడంతో కేసు ఆలస్యంగా వెలుగు చూసింది.

చదవలేక పోతున్నానని విద్యార్థి ఆత్మహత్య


సంగీత (ఫైల్)

పేట్‌బషీరాబాద్, (ఆంధ్రజ్యోతి): చదువులో రాణించలేకపోతున్నానని ఓ విద్యార్థిని మనస్తాపానికి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన శంకర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. కూతురు సంగీత (18) ఇంటర్మీడియెట్ చదువుతోంది. బుధవారం తనకు కడుపులో నొప్పి వస్తుందని కాలేజీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. భార్యాభర్తలు రోజులానే పనికి వెళ్లారు. ఇద్దరు కుమారులు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సంగీత ఉరి వేసుకుంది. మధ్యాహ్నం స్కూల్ నుంచి వచ్చిన చిన్న కుమారుడు శ్రీసాయికి ఉరి వేసుకొని ఉన్న అక్క కనిపించింది. దీంతో శంకర్‌కు సమాచారం అందించాడు. ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్పవరం


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరం అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.18 లక్షల చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ బుధవారం చేశారు. వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో 55 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.18 లక్షల విలువ గల చెక్కులను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, జనార్ధన్‌రెడ్డి, మంత్రిప్రగడ సత్యనారాయణ, రాజేందర్, శ్రీనివాస్, అనిల్, దుర్గారావు, అంకారావు పాల్గొన్నారు.

- వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ కాలనీలో బోనాల ఉత్సవాల్లో భాగంగా ఫలహారంబండి ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ప్లాట్ల అమ్మకం పేరుతో మోసం.. వ్యక్తి అరెస్ట్

హైదర్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వెంచర్‌లోని ప్లాట్లను కొనుగోలు చేయడం ద్వారా అధిక లాభాలు పొందొచ్చని నమ్మించి మోసానికి పాల్పడిన వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో నివసించే అరిమంద సుజాత, వివేకానందనగర్‌లో నివసించే పోచారెడ్డి సరిత అనే ఇద్దరు మహిళలు స్నేహితులు.. వీరికి ప్రొద్దుటూరుకు చెందిన గిద్దలూరు నాగేంద్ర ఆచారి (32) పరిచయం అయ్యాడు. తాను షణ్ముఖ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ ప్రతినిధినని, తమ సంస్థకు వికారాబాద్ జిల్లా ఎల్లకొండా గ్రామంలో సర్వే నంబర్ 307 నుంచి 313 వరకు ఉన్న భూమిలో ప్లాట్లను అభివృద్ధి చేసి విక్రయిస్తున్నామని తెలిపాడు. తక్కువ ధరకే ప్లాట్లు కొని అధిక ధరలకు విక్రయించొచ్చని చెప్పాడు. అతడి మాటలను నమ్మి సుజాత రూ.23.95 లక్షలు, సరిత రూ.11.70 లక్షలు ప్లాట్లను కొనేందుకు చెల్లించారు. అంతేకాకుండా 2022 ఫిబ్రవరిలో సేల్ అగ్రిమెంట్ చేసుకున్నారు. పూర్తిగా డబ్బులు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేయమని కోరారు. పలుమార్లు నాగేంద్రచారిని ఈ విషయమై అడిగారు. కానీ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో బాధిత మహిళలు సుజాత, సరితలు కేపీహెచ్‌బీ కాలనీలో ఎంఐజీ రోడ్ నెంబర్ 1లోని ఆఫీస్‌కు వెళ్లి నిలదీయగా డబ్బులు వెనక్కి ఇస్తానని, దానికి సంబంధించి చెక్కులు ఇచ్చాడు. అతడు ఇచ్చిన చెక్కులు బ్యాంకులో వేయగా బౌన్స్ అవడంతో బాధితులు ఇద్దరు ఏప్రిల్ 1వ తేదీన కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం నాగేంద్రచారిని మాదాపూర్ హైటెక్ సిటీలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారమే

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి
- రేవ్‌పార్టీ నిందితులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్


కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ ఘట్‌కేసర్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారం అవుతుందని తల్లిదండ్రులు, పిల్లలు తెలుసుకోవాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. ఇటీవల మాదాపూర్ రేవ్‌పార్టీలో డ్రగ్స్ వినియోగిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన నిందితులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. భవిష్యత్తులో డ్రగ్స్ మహమ్మారి జోలికి పిల్లలు వెళ్లకుండా చూస్తామని హామీ ఇస్తేనే విముక్తి కల్పిస్తామన్నారు. ఇక నుంచి పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు హామీ ఇచ్చారు. అబ్కారీ భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అడిషనల్ ఎస్పీ భాస్కర్‌గౌడ్, ఎస్ఎఫ్‌టీ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, డీఎస్పీ తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం వినియోగిస్తే అనుమతి తప్పనిసరి

ఫంక్షన్ హాళ్లు, రిసార్టుల్లో నిర్వహించే బర్త్‌డే పార్టీలు, ఇతర శుభకార్యాల్లో మద్యం వినియోగిస్తే తప్పనిసరిగా ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమల్‌హాసన్‌రెడ్డి సూచించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'రిసార్ట్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు' వార్తకు ఆయన స్పందించారు. మేడ్చల్ జిల్లా అంకుషాపూర్‌లోని ది కాంటినెంటల్ రిసార్ట్‌లో సోమవారం అర్ధరాత్రి బిగ్‌బాస్ ఫేమ్ మహబూబ్ ఇచ్చిన బర్త్‌డే పార్టీలో టీవీ నటులు, సెలబ్రిటీలు పాల్గొని అనుమతి లేకుండా మద్యం వినియోగించిన విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

గాజులరామారం: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం సీఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యానం జిలేంత్రంకు చెందిన సుబ్బారావు(45) 14 ఏళ్ల క్రితం కుటుంబసభ్యులతో కలిసి నగరానికి వలసవచ్చి సూరారం సాయిబాబానగర్‌లో నివాసం ఉంటున్నాడు. సమీపంలో స్క్రాప్ దుకాణంలో పని చేస్తాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి డ్యూటీకి వెళ్లి తాను పనిచేస్తున్న స్క్రాప్ దుకాణంలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుబ్బారావు భార్య చంద్రకాంతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కొత్త స్టేడియం నిర్మాణంపై జగన్ హర్షం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ శివార్లలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించడంపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రేవంత్ అసెంబ్లీలో మాట్లాడుతూ మెట్రో, ఎయిర్‌పోర్టు అందుబాటులో ఉండేలా హైదరాబాద్ శివార్లలో స్టేడియం నిర్మిస్తామని చెప్పడం, రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి శుభపరిణామమని తెలిపారు. గతవారం స్టేడియం నిర్మాణానికి 100 నుంచి 120 ఎకరాలు కావాలంటూ హెచ్‌సీఏ తరఫున చేసిన విజ్ఞప్తిని సీఎం ఆమోదించి, ప్రకటన చేసినందుకు జగన్ కృతజ్ఞతలు తెలిపారు.

పదవీవిరమణ పొందిన మాజీ అధ్యక్షుడికి సత్కారం

బాలానగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని హెచ్‌ఏఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) మాజీ అధ్యక్షుడు రామారావు బుధవారం పదవీవిరమణ పొందాడు. ఈ సందర్భంగా ఆయనను ఐఎన్‌టీయూసీ నాయకులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అడ్వైజర్ జి.గోపాల్, అధ్యక్షుడు సబ్జాతుల్లా, కార్యదర్శి కర్క నాగరాజు, నాయకులు శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్, పోలేపల్లి శ్రీకాంత్, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.


బాపూజీ దంపతులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్, రెక్టార్, డైరెక్టర్ తదితరులు

జేఎన్‌టీయూ డైరెక్టర్, డిప్యూటీ రిజిస్ట్రార్‌లకు సన్మానం

హైదరాబాద్‌సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అకడమిక్ అఫైర్స్ విభాగం డైరెక్టర్ కె.ఎం.లక్ష్మణరావు, పరీక్షల విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రార్ బాపూజీల పదవీవిరమణ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. బుధవారం సాయంత్రం యూజీసీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సన్మానసభలో పలువురు ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. డైరెక్టర్ లక్ష్మణరావు, డిప్యూటీ డైరెక్టర్ బాపూజీ తమ ఉద్యోగ ధర్మాన్ని మరువకుండా విధులు నిర్వహించారని కొనియాడారు. ఇరువురు అధికారులు ఉన్నత పదవుల్లో ఉండి ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ కె.విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి, పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎ.అరుణకుమారి, పలు విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

3 నుంచి హైదరాబాద్‌లో

సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్


సాహిత్యోత్సవ్‌లో గజల్స్ ఆలపిస్తున్న వార్సీ బ్రదర్స్

హైదరాబాద్‌సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): హిందుస్తానీ కళలు, సంస్కృతి, సాహిత్యాన్ని వేడుక చేసే అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో ఒకటైన సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ మొదటిసారిగా హైదరాబాద్‌లో జరగనుంది. ఈ కార్యక్రమం ఆగస్టు 3, 4 తేదీల్లో మనూలో జరగనుంది. ఈ సాంస్కృతికోత్సవాల విశేషాల గురించి జష్న్-ఏ-ఆదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ చౌహాన్ మాట్లాడు తూ ' పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం అద్భుత విజయం సాధించిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చింది. ఈ సాంస్కృతికోత్సవంలో దక్కనీ ఉర్దూపై పర్షియన్ ప్రభావంపై చర్చతో పాటుగా డాక్టర్ విద్యా షా గజల్స్, వార్సీ బ్రదర్స్ ఖవ్వాలి, యామినీరెడ్డి నృత్యప్రదర్శన, ఉర్దూలో శ్రీమద్ భగవద్గీత పఠనం వంటివి ఉంటాయి. దేశవ్యాప్తంగా సుప్రసిద్ధ కవులు, గాయకులు, కళాకారులు పాల్గొననున్న ఈ కార్యక్రమంలో సాహిత్య, కళాభిమానులు పాల్గొనవచ్చు' అని తెలిపారు.

కార్మికుల సేవలతోనే ఆర్టీసీకి ఆదరణ

ఫతేనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల అంకిత భావం, మెరుగైన సేవలతోనే ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎం డి.హరి, డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి శ్రీలత అన్నారు. లక్షే లక్ష్యంగా చేసుకుని డ్రైవర్లు, కండక్టర్లు పని చేయాలని ఆర్‌టీసీ అధికారుల ఆదేశాలను పాటించి ఫలితాలు సాధించిన మూడు జోడీ (డ్రైవర్ + కండక్టర్)లకు డీఎం నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.1001, రెండో బహుమతి రూ.751, మూడో బహుమతి రూ.500 నగదు బహుమతిని అందజేశారు. మంచి సేవలు అందించిన మరో 10 మంది డ్రైవర్లు, 10 మంది కండక్టర్లు, 10 మెకానిక్‌లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అవార్డు అందుకున్న డ్రైవర్లు బి.రాజిరెడ్డి, బి. లింగయ్య, ఎం.రాఘవయ్య, కండక్టర్లు ఎం. శైలజ, జె. రుద్రరాజు, జి.రమాదేవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ రాజేశ్వరి ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

నిఫ్ట్‌లో ప్రారంభమైన ఓరియంటేషన్

హైదరాబాద్ సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభ సూచికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. కొత్త బ్యాచ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా ప్రారంభమైన ఈ వేడుకల్లో వెల్‌స్పన్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్, హెడ్-సౌత్ శ్రీసా భార్గవ మొవ్వ, నిఫ్ట్ హైదరాబాద్ పూర్వ విద్యార్థి, సుప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్ అర్చనారావు, టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల తో పాటు నిఫ్ట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (2024-28) కోసం 245 మంది, పోస్ట్ గ్రాడ్యుయేషన్ (2024-26) కోసం 35 మంది విద్యార్థులు చేరారని, వీరికి క్యాంపస్‌లో అందుబాటులోని సదుపాయాలు, ఉండాల్సిన విధానం తదితర అంశాలను తెలియజేస్తామని నిఫ్ట్ డైరెక్టర్ వెల్లడించారు. ఓరియేంటేషన్ కార్యక్రమంలో భాగంగా బీట్స్ ఆఫ్ జాజ్, స్కిట్ షో, లెదర్ పప్పెట్రీ షో, రంగ్ తరంగ్ కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రిటైర్డ్ పోలీసు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణపొందిన 36 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి బుధవారం సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం పోలీసుశాఖ నుంచి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, పోలీస్ శాఖ తరఫున మీకు, మీ కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ అడ్మిన్ జె.పరిమళ హనా నూతన్, చీఫ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాస్, ఏడీఓ శ్రీదేవి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు యన్.శంకర్‌రెడ్డితో పాటు పలువురు పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

- సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బుధవారం పదవీ విరమణ పొందిన 8 మంది ఉద్యోగులను జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఘనంగా సన్మానించారు.


రిటైరయిన ఉద్యోగులను సన్మానిస్తున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

చదువును అలక్ష్యం చేయొద్దు: ఎమ్మెల్యే

బాలానగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు బానిసలై చదువును అలక్ష్యం చేస్తే భవిష్యత్‌లో బాధలు పడాల్సి వస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విద్యార్థులకు సూచించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తన సొంత నిధులతో బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 170 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, కిట్లు, బ్యాగులు స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలవాలన్నారు.

ఇతర రాష్ట్రాల క్యాబ్‌లను అనుమతించొద్దు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రెండోరోజూ కొనసాగిన ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లకు అనుమతివ్వొద్దని డిమాండ్ చేస్తూ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్యాబ్‌డ్రైవర్లు చేపట్టిన ఆందోళన బుధవారం రెండోరోజూ కొనసాగింది. ఈ సందర్భంగా క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొందరు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి క్యాబ్‌లను తీసుకొచ్చి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నడిపించి తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని, తాము రోడ్డున పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇంతకుముందు జీఎంఆర్ అధికారులుకు, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లను ఎయిర్‌పోర్టులోకి అనుమతిని రద్దుచేసే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు.

పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండాలి: జడ్సీ


యూసఫ్‌గూడలో పార్కును పరిశీలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలోని పార్కుల్లో పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్‌లో యూసుఫ్‌గూడ బస్తీ, బోరబండలో ఆయన అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూసుఫ్‌గూడ పార్కు చారిత్రాత్మకమైనదని, దానికి కాపాడుకుంటూ పచ్చదనం పెంచుతూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా వృద్ధులు, చిన్నారుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. కుటుంబతో సహ పార్కులో సేద తీరేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కాలనీల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. రహదారులపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షానికి రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ఎంటమాలజీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ కమిషనర్ నాయక్ అనిల్‌కుమార్‌తో పాటు ఆయా అధికారులు ఉన్నారు.

- **జడ్సీని కలిసిన ఎఫ్ఎఫ్ఏలు**

కేపీహెచ్‌బీకాలనీ: తెలంగాణ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ చౌహాన్‌ను కలిసి పారిశుధ్య కార్మికులు, ఎఫ్ఎఫ్ఏలు తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం విన్నవించారు. కార్మికులకు ఇవ్వాల్సిన సామాగ్రితో పాటు ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి సంబంధించిన నిధులు త్వరగా విడుదల అయ్యేలా చూడాలని కోరారు. జడ్సీని కలిసిన వారిలో ఎస్ఎఫ్ఏలు నీలం చిరంజీవి, నర్సింహ, రమేష్, సాయికుమార్, లక్ష్మీ, పవన్, కృష్ణ, కుమార్, దేవరాజ్, మల్లికార్జున్, మల్లేష్, సంజీవ్‌కుమార్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366